క్లుప్తంగా

పారదర్శకంగా పథకాల అమలు

గోపాల్‌పేట: ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం రోజున ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఏదుట్లలో కొనసాగిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పక్కా ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వకుండా ఉన్న రేషన్ కార్డులను తీసేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతని ఇల్లు రేషన్ కార్డులు, భూమిలేని పేదలను గుర్తించి సాయం అందించనుందని చెప్పారు. నిజమైన లబ్ధిదారులకు పథకాలు అందుతాయని.. ప్రజలు సైతం అధికారులకు సహకరించాలని సూచించారు.

రైతుభరోసాకు దరఖాస్తుల ఆహ్వానం

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా పథకం కోసం వ్యవసాయ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ కోరారు. పట్టదారు పాస్‌పుస్తకాలతో పాటు బ్యాంక్ పాస్‌బుక్కు, ఆధార్‌కార్డు ఈ నెల 31వ తేదీ వరకు తమ కార్యాలయంలో అందించాలన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందనలు



వీపనగండ్ల: మండలంలోని కల్వరాల ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా కేంద్రంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో వారిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. రవాణా, విద్య, భద్రత అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో అభినవ్, సాయికృష్ణ, కార్తీక్‌రెడ్డి, మోహన్, లోకేష్ జట్టుగా వ్యవహరించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని పొందారు. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ యుగేందర్, శేఖర్, మహానంది, పాఠశాల గెజిటెడ్ హెడ్‌మాస్టర్ రాజవర్ధనాచారి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌గుప్తా, జితేందర్‌గౌడ్, బక్కన్న, నిరంజన్ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

మల్లాపురంలో ప్రత్యేక పూజలు



ఆత్మకూర్: పట్టణ శివారులోని మల్లాపురం క్షేత్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి దంపతులు ఎన్నికల ముందు నామినేషన్ పత్రాలతో ఇక్కడి ఆలయంలో పూజలు నిర్వహించి వెళ్లారని, శుక్రవారం మొక్కులు తీర్చుకున్నారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా ప్రధాన అర్చకులు వెంకటశేషశర్మ, కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి కోట్ల దంపతులను శేషవస్త్రాలతో సత్కరించారు.

అర్హులకు న్యాయం చేయాలి

పాన్‌గల్: ప్రభుత్వం ఈనెల 26వ తేదీ నుంచి అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలలో అర్హులకు న్యాయం చేయాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ శుక్రవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో అధికారులకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభల్లో సంక్షేమ పథకాలకు సంబంధించిన జాబితా వివరాలు అన్ని తప్పుల తడక, అనర్హుల పేర్లు ఉండడంతో అర్హులైన పేదలకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో గ్రామసభలో ప్రజలు సూచించిన పేదవారికే పథకాలు అందేలా చూస్తూ అనర్హుల పేర్లు తొలగించాలని డిమాండ్ చేశారు. తండావాసులు గ్రామసభలో సూచించిన విధంగానే లబ్ధిదారులను ఎంపిక చేస్తామని అధికారులు చెప్పడంతో తండాలో గ్రామసభ సజావుగా సాగేందుకు సహకరించారు. తండాల్లో సంక్షేమ పథకాలు అర్హులకు అందకపోతే గిరిజనులతో కలిసి ఆందోళనలు చేపడ్తామన్నారు.

సారా పట్టివేత

పెంట్లవెల్లి: స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం ఎక్సైజ్ అధికారులు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఎంగంపల్లి తండా నుంచి పెంట్లవెల్లి గ్రామానికి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై సారా తీసుకెళ్తుండగా 12 లీటర్ల సారాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బైక్‌ను సీజ్ చేశారు. అనంతరం నిందితులను తహసీల్దార్ జయంతి ఎదుట బైండోవర్ చేశారు.

నిరసనలు.. బుజ్జగింపులు



ఆత్మకూర్‌లో అధికారులతో వాగ్వాదానికి దిగిన స్థానికులు

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా ప్రకటించేందుకు నిర్వహించిన గ్రామసభలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నాలుగు రోజులుగా జిల్లా వ్యాప్తంగా చేపట్టిన గ్రామసభల్లో అధికారులు విడుదల చేసిన లబ్ధిదారుల జాబితాలో అనర్హులకు పథకాల కేటాయింపులో పెద్దపీట వేశారని పేర్లు లేని వారు ఆందోళన చేశారు. చాలా గ్రామాల్లో చిన్న చిన్న అల్లర్లు మినహా గ్రామసభలు సజావుగానే సాగినా.. కొన్ని చోట్ల ప్రజలు గ్రామసభలను బహిష్కరించారు. పథకాల అమలులో పేర్లు లేని వారు మరోమారు దరఖాస్తు చేసుకుంటే వారికి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో చేసేదేం లేక ప్రజలు మరోమారు దరఖాస్తులు అందించారు.

❐ ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిదో వార్డులో నిర్వహించిన వార్డుసభలో రసాభాసా చోటుచేసుకోవడంతో అర్ధాంతరంగా ముగిసింది. అనర్హుల పేర్లను జాబితా నుంచి తొలగించాలని, అర్హులైన వారందరికీ న్యాయం చేయాలని పట్టుబట్టడంతో కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ, కమిషనర్ శశిధర్ జాబితాను ప్రదర్శించి దరఖాస్తులు ఆహ్వానించారు. ఎస్‌ఐ నరేందర్ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ప్రజలు ఆందోళన కొనసాగించారు. అలాగే మండలంలోని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం 5,847, రేషన్‌కార్డుల కోసం 1,469, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 368, రైతుభరోసా కోసం 35 దరఖాస్తులు వచ్చినట్లు ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి, తహసీల్దార్ చాంద్‌పాష, ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి, ఏఓ వినయ్‌కుమార్ తెలిపారు.

❐ పాన్‌గల్ మండలంలోని కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి తండాలో నిర్వహించిన గ్రామసభల్లో ప్రకటించిన జాబితాలో అర్హుల పేర్లు రాలేదని స్థానికులు అధికారులను నిలదీశారు. తెల్లరాళ్లపల్లితండాలో అధికారులపై తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సభ నుంచి వెళ్లిపోతున్న క్రమంలో పోలీసులు, నాయకులు కల్పించుకొని సముదాయించడంతో ప్రజలు శాంతించారు. చివరి రోజు ఇందిరమ్మ ఇళ్ల కోసం 71, ఆత్మీయ భరోసాకు 25, రేషన్‌కార్డులకు 120 కలిపి మొత్తం 216 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ గోవింద్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘురాములు, ఆర్‌ఐ తిరుపతయ్య, నాయకులు రవికుమార్, రాజునాయక్, రవినాయక్, బాల్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

❐ వనపర్తి మండలంలోని దత్తాయిపల్లి గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక అధికారి రవీందర్ గ్రామసభ నిర్వహించి.. లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. అనంతరం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పెద్దగూడెంలో ఎంపీడీఓ రాఘవ అర్హుల జాబితాను చదువుతుండగావి వినిపిస్తుండగానే.. పేర్లు రాని వారు అభ్యంతరం తెలిపారు. పలుమార్లు సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నా.. అధికారులు మరోమారు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకాలు అమలు చేయడం కంటే దరఖాస్తులు స్వీకరించడంతోనే ప్రభుత్వం కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏఓ కురుమయ్య తదితరు లు పాల్గొన్నారు.



కేతేపల్లిలో మాట్లాడుతున్న అధికారులు



పెద్దగూడెం గ్రామసభలో అధికారులతో వాగ్వాదం చేస్తున్న మహిళ



తెల్లరాళ్లపల్లితండాలో మహిళలకు నచ్చజెపుతున్న పోలీసులు, నాయకులు

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



పాన్‌గల్ పాఠశాలలో బడిలో చేరిన విద్యార్థులతో ఎంఈఓ, ఉపాధ్యాయ బృందం



బొల్లారంలో..

పాన్‌గల్: బడిఈడు పిల్లలను బడుల్లో చేర్పించాలని ఎంఈఓ శ్రీనివాసులు విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. బడిఈడు పిల్లల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంతో పాటు జమ్మాపూర్ గ్రామాల్లో బడిబయటి పిల్లలను గుర్తించి సీఆర్పీలతో కలిసి ఎంఈఓ ఆయా గ్రామాల పాఠశాలల్లో చేర్పించారు. మండల కేంద్రంలో బడి బయట ఉన్న 2వ తరగతి విద్యార్థి విష్ణు, 5వ తరగతి విద్యార్థి రాజ్‌కుమార్, జమ్మాపూర్‌లో 4వ తరగతి విద్యార్థి చరణ్, 5వ తరగతి విద్యార్థి తేజ ను బడిలో చేర్పించామన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఆరేళ్ల నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలందరిని బడికి పంపించాలని, వారిచే పనులు చేయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఆయన హెచ్‌ఎంకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పద్మ, వీరశేఖరాచారి, సీఆర్పీలు గోవింద్‌నాయక్, రమాదేవి, భార్గవి, ఐఈఆర్పీ సంతోష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వీపనగండ్ల: బడి మానివేసిన పిల్లలను బడిలో చేర్పించినప్పుడే వారి హక్కులను పరిరక్షించిన వాళ్లం అవుతామని సీఆర్పీ నాగరాజు, ఉపాధ్యాయులు అన్నారు. శుక్రవారం బొల్లారంలో ఇంటింటికీ తిరుగుతూ బడి బయట ఉన్న పిల్లల వివరాలను సేకరించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నిరంజన్, ఉపాధ్యాయులు పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖ నిర్వహిస్తున్న బడి బయట పిల్లల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా ఆత్మకూర్ మండలంలో సర్వే కొనసాగుతుంది. సీఆర్పీ సౌమ్యరాణి, ఈఆర్టీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని గ్రామాల్లో బడి బయటి పిల్లల వివరాలను నమోదు చేశారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



వనపర్తి రూరల్: మండలంలోని కందిరీగతండాలో నీటి సమస్య ఎక్కువగా ఉందని స్థానిక నాయకులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన బోరు బండిని పంపించి శుక్రవారం గ్రామంలో బోరు డ్రిల్ చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో ఎమ్మెల్యే, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగరాజు, గ్రామస్తులు మన్నెంనాయక్, హరిలాల్‌నాయక్, లోకేష్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కళాకారుల మండల కమిటీ ఏర్పాటు



గోపాల్‌పేట: హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న ఎస్సీ వర్గీకరణ అమలు కోసం మందకృష్ణ మాదిగ తలపెట్టిన లక్ష డప్పులు వెయ్యి గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీ జిల్లా అధ్యక్షుడు కుర్మయ్య, జిల్లా కోకన్వీనర్ గట్టుస్వామి మాదిగ కోరారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ లక్ష డప్పులు వెయ్యి గొంతులు కార్యక్రమం విజయవంతం చేసే క్రమంలో కళాకారుల పాత్ర కీలకం అన్నారు. అందువల్ల శుక్రవారం మండల డప్పు కళాకారుల మండల కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. మాదిగలు, ఉపకులాలు సహకరించి ఫిబ్రవరి 7న జరిగే సభకు ప్రతి ఇంటి నుంచి ఒక డప్పుతో వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గోపాల్‌పేట మండల అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు

పట్టణాభివృద్ధికి కృషి చేశాం

- వీడ్కోలు సమావేశంలో మున్సిపల్ పాలకవర్గం



వీడ్కోలు సన్మానంలో పాల్గొన్న మున్సిపల్ పాలకమండలి

అమరచింత: పదవిలో ఉన్నంత కాలం పట్టణాభివృద్ధికి ఎనలేని కృషి చేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్ గోపి, కౌన్సిలర్లు అన్నారు. అమరచింత మున్సిపల్ పాలకవర్గ పదవీ కాలం ముగింపు సందర్భంగా కౌన్సిలర్లను కార్యలయం సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ గోపి మాట్లాడుతూ పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేయాలనుకున్నా.. నిధులు మంజూరు కాకపోవడంతో ఆశించిన మేరకు అభివృద్ధి జరగలేదన్నారు. బీసీ కాలనీలోని 7వ వార్డులో కనీసం డ్రైయినేజీ కూడా నిర్మించలేదన్నారు. మూడో వార్డు కౌన్సిలర్ విజయరాములు మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త నాగభూషణంగౌడ్ కారణంగానే పట్టణం అభివృద్ధికి నోచుకోలేదని దుయ్యబట్టారు. అభివృద్ధి వ్యవహారంలో కౌన్సిలర్లను కలుపుకొని పోవాలని పలుమార్లు విన్నవించినా చైర్‌పర్సన్ భర్త ఒంటెద్దు పోకడలు పోయారని ఆరోపించారు. పది మంది కౌన్సిలర్లలో గ్రూపు రాజకీయాలు సృష్టించి ఒకరిపై ఒకరికి ద్వేషం రగిలించడంతో వార్డుల అభివృద్ధి చేపట్టలేక పోయామన్నారు. అవకాశం అందివస్తే పట్టణాభివృద్ధికి ఎల్లవేళలా తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మి, లావణ్య, సింధు, మాధవి, ఉషారాణి, విజయరాములు, రాజ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం, మేనేజర్ ఇసూఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

విరాళాలు అందజేత



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపనకు కొత్తకోట మాజీ సర్పంచ్ సాక బాలనారాయణతో పాటు ఆయన సోదరులు సాక వెంకటయ్య, సాక నరసింహులు, సాక రాములు తమ వంతు సహాయంగా రూ.3.35లక్షలు విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. అదేవిధంగా కేపీఎస్ స్కూల్ అధినేత ఎద్దుల రాజవర్ధన్‌రెడ్డి రూ.1.50లక్షలు, పోతుల నాగేష్ రూ.21వేలు, వెంకటాచారి రూ.10,116 అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఫిబ్రవరి 13, 14, 15 తేదీల్లో శ్రీకృష్ణ ఆలయంలో విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈఓ మద్దిలేటి

వనపర్తి విద్యావిభాగం: విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని మండల విద్యాధికారి మద్దిలేటి సూచించారు. శుక్రవారం స్థానిక నారాయణ పాఠశాలలో జోనల్ స్థాయి మాస్టర్ ఒరేటర్ కాంటెస్ట్ నిర్వహించారు. ఈ పోటీల ద్వారా విద్యార్థుల అంతర్గత నైపుణ్యాలను వెలికి తీయడం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు అన్నారు. వనపర్తి, షాద్‌నగర్ నారాయణ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ మద్దిలేటి మాట్లాడుతూ గమనించడం, మాట్లాడటం, చదవడం, రాయడం (ఎల్‌ఎస్‌ఆర్‌డబ్ల్యూ) వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ప్రతి విద్యార్థికి అవసరమన్నారు. నారాయణ సంస్థల డీజీఎం వెంకటరమణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా స్వీయనైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని, భవిష్యత్‌లో మరింత పురోగతి సాధించేందుకు నిరంతరం శ్రమించాలన్నారు.

క్షయ నివారణపై అవగాహన



క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్ గ్రామంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణపై శుక్రవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య మాట్లాడారు. 2 వారాలకు మించి ఎడతెరపి లేకుండా దగ్గు, జ్వరం, తెమడలో రక్తం పడటం , అలసట, రాత్రిపూట చెమటలు పట్టడం, స్వల్ప కాలంలో బరువు తగ్గడం శారీరక ఆరోగ్యంలో ఆకస్మిక మార్పులు, ఛాతీ ఎక్స్‌రేలో అసాధారణ మచ్చలు కనిపించడం వంటి లక్షణాలు ఉంటే తెమడ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యుల సూచనల మేరకు 6 నెలలు క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. వ్యాధి సోకిన వారికి నిక్షయ్ పోషణ్ యోజన పథకం ద్వారా బలవర్ధక పోషకాహారం కోసం ప్రతి నెల రూ.1000 అందిస్తారన్నారు. 16 మంది అనుమానితుల నుంచి తెమడ వ్యాధి నిర్ధారణ కోసం సేకరించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు రామచందర్, మధుబాబు, సుమిత్ర, ఆశా కార్యకర్తలు లలిత, యాదమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

జంతువుల కళేబరాలను తొలగించండి



పంట పొలంలో విద్యుత్ కంచెకు తగిలి చనిపోయిన కోతుల కళేబరాలు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్సీ హాస్టల్ వెనుక వైపున పంట పొలాల్లో విద్యుత్ షాక్‌తో మృతిచెందిన కోతులు, కుక్క కళేబరాలతో దుర్వాసన వస్తుందని, వాటిని తొలగించాలని కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కళాశాల వెనుక వైపున ఉన్న పంటలకు అడవి పందుల నుంచి రక్షణ కోసం రైతు విద్యుత్ కంచె ఏర్పాటు చేశారు. రెండు రోజుల క్రితం విద్యుత్ కంచెకు తాకి నాలుగు కోతులు, ఒక కుక్క మృతిచెందాయి. మృతి చెందిన జంతువుల కళేబరాలను తొలగించకపోవడంతో దుర్వాసన వస్తుందని వారు వాపోయారు. వ్యవసాయ పొలాల పక్కనే కళాశాల, ఎస్సీ హాస్టల్ ఉండటంతో అటు వైపు విద్యార్థులు వెళ్తే ప్రమాదాలు చోటు చేసుకునే ప్రమాదం ఉందని అధ్యాపకులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పంటల రక్షణకు విద్యుత్ తీగలు వాడొద్దని పోలీసులు చెబుతున్నా రైతుల్లో మార్పు రావడం లేదు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి పంట రక్షణకు విద్యుత్ తీగలను వాడకుండా వారికి అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి నరేష్‌ను వివరణ కోరగా.. కళాశాల సమీపంలో చనిపోయిన జంతువుల కళేబరాలను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

బాబాసాహెబ్ అంబేడ్కర్ సేవలు విస్మరించొద్దు



ఖిల్లాఘనపురం ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఖిల్లాఘనపురం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ దేశానికి అందించిన సేవలను విస్మరించొద్దని బీజేపీ మండల అధ్యక్షులు బుచ్చిబాబుగౌడ్ అన్నారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కమిటీ ఆదేశం మేరకు 'సంవిధాన్ గౌరవ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లను సందర్శించారు. ఆయా హాస్టళ్లు, పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి.. రాజ్యాంగ నిర్మాణంలో అంబేడ్కర్ చేసిన కృషిని వివరించారు. భారత ప్రభుత్వం అంబేడ్కర్‌ను భారతరత్నతో సత్కరించడంతో పాటు ఆయన నివసించిన, చదివిన ప్రాంతాలను పంచతీర్థ అనే పేరు పెట్టి అభివృద్ధి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు డి. సత్యనారాయణ, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఆశన్న, దళితమోర్చా ప్రధాన కార్యదర్శి శివకుమార్, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటేష్, మండల యువ మోర్చా అధ్యక్షుడు గోపి ముదిరాజ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కర్పూరి ఠాకూర్‌కు ఘన నివాళి



కర్పూరి ఠాకూర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండు వద్ద శుక్రవారం నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ 101వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఆశన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కర్పూరి ఠాకూర్ జయంతి రోజునే భారతరత్న అవార్డు ప్రకటించడం హర్షించదగిన విషయమన్నారు. స్వాతంత్ర్య, క్విట్ ఇండియా ఉద్యమంలో ఆయన పాల్గొని విశేష సేవలు అందించారని కొనియాడారు. బీసీ, మహిళా రిజర్వేషన్, మద్యపాన నిషేధం లాంటి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించారన్నారు. ఆలయాల పాలక మండలిలో నాయీబ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో అంజనేయులుగౌడ్, విక్రం, బుచ్చిబాబు, బాబు, శివశంకర్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఖురాన్ ప్రపంచ మానవాళికి మార్గదర్శకం



ప్రసంగిస్తున్న మౌలానా

ఆత్మకూర్: దివ్యఖురాన్ ప్రపంచ మానవాళికి మార్గదర్శకమని, ప్రతి ముస్లిం ఖురాన్ పఠనం చేయాలని హజ్రత్ మౌలానా ఫక్రుద్దీన్ అన్సారీ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక మస్జిదేనూర్‌లో పట్టణంలోని మక్తబ్ మదర్సా జియాఉల్ ఖురాన్ (అరబ్బీపాఠశాల) విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా మౌలానాలు ఇష్తేఖార్, ఎజాజ్‌సాబ్, సుబూర్‌ఖాన్, సఫ్దర్‌హుస్సేన్, అబ్రార్ మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ సల్లల్లా హువలై వసల్లం సూక్తులు ఆచరనీయమని, ప్రతి ముస్లిం తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించాలని, ప్రతినిత్యం ఐదుపూటలు నమాజ్ ఆచరించడంతో పాటు దాన, ధర్మాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ హాఫీజ్ ఫక్రుద్దీన్, హాఫీజ్ ముక్తదీర్, మౌలాన అబ్దుల్‌అలీం రషాది, రిటైర్డ్ ఎంఈఓ యాసూఫ్‌సాబ్, అబ్దుల్‌వాహేద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యపై దృష్టి సారించాలి



వీపనగండ్ల అంగన్‌వాడీ కేంద్రంలో బాలికల దినోత్సవంలో పాల్గొన్న ఎంఈఓ నర్సింహులు

అమరచింత: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారులతో కలిసి బాలికా సాధికారిత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ రాధిక చిన్నారులకు హారతి ఇచ్చి గౌరవించారు. బాలికను 'బతకనిద్దాం–బాలికను చదువుకోనిద్దాం' అంటూ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. సమాజంలో బాలిక రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన కల్పించారు.

వీపనగండ్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్య అభ్యసిస్తున్న పసిపిల్లల విద్యపై అంగన్‌వాడీ టీచర్లు దృష్టి సారించినప్పుడే పూర్వ ప్రాథమిక విద్య లక్ష్యాలు నెరవేరుతాయని మండల విద్యాధికారి నర్సింహులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో 17వ జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్నారులకు మిఠాయిలతో పాటు బహుమతులను అందజేశారు. చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ ప్రభుత్వం నుంచి అందుతున్న పౌష్టికాహారం ప్రతి చిన్నారి వినియోగించుకునేలా చూడాలని ఆయన అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, మహేశ్వరి, ఎల్లమ్మ, హెల్పర్లు లచ్చమ్మ, నిరంజనమ్మ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో వ్యక్తికి జైలుశిక్ష

వీపనగండ్ల: మండలంలోని పుల్గర్‌చర్ల గ్రామానికి చెందిన శీలం రవికుమార్ మద్యం తాగి వాహనం నడపడంతో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో పోలీసులకు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసిన పోలీసులు రవికుమార్‌ను శుక్రవారం వనపర్తి ఫస్ట్ అడిషనల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరపర్చగా.. జడ్జి బండారు శ్రీలత 5 రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ రాణి, కోర్టు కానిస్టేబుల్ రాజేందర్ తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారికి తగిన చర్యలు తీసుకుంటామని, మండలంలోని వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని కోరారు.